పంచాయతీలకే ప్రాధాన్యం

- కార్యదర్శుల చేతికి డిజిటల్ కీ
- సత్వరమే అందనున్న సేవలు


తాడూరులో డిజిటల్ కీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

తాడూరు: పనుల్లో పారదర్శకత ఉండేలా ప్రజలకు అందించే సేవల్లో జాప్యాన్ని నివారించి సత్వరమే అందించేలా ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. ఈ మేరకు అన్ని పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శుల చేతికి డిజిటల్ కీ అందిస్తుంది. దీంతో కార్యదర్శులకు పనిభారం తగ్గడంతో పాటు దరఖాస్తుదారులకు సమయం కలిసిరానుంది. మొదట పంచాయతీల్లో కేవలం జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల జారీకి మాత్రమే డిజిటల్ కీ అనుమతిస్తూ ప్రభుత్వం ఇటీవల అనుమతులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని కార్యదర్శులకు డిజిటల్ కీ అందించారు. ఇకపై అన్ని ధ్రువపత్రాలు ఆన్‌లైన్ ద్వారా జారీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తుంది.

ప్రస్తుతం జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి
పాఠశాలలో ప్రవేశాలు, ఉన్నత చదువుల కోసం జనన ధ్రువీకరణ పత్రాలు అవసరం కాగా, ఉద్యోగులు, ఇన్సూరెన్స్ కలిగిన వారు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు మరణ ధ్రువీకరణ పత్రాలు అవసరంగా మారాయి. గ్రామాలలో ఇంటి, నల్లా పన్ను, పారిశుద్ధ్యం, గ్రామ సభల నిర్వహణ, హరితహారం, ఈజీఎస్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు దాదాపు 34 రకాల పనులు కార్యదర్శులు చేయాల్సి ఉంటుంది. కార్యదర్శులకు పనిభారం తగ్గడంతో పాటు త్వరితగతిన పత్రాల జారీకి అవకాశం ఉండడంతో డిజిటల్ కీ అమలు చేస్తున్నారు.

అక్రమాలకు చెక్
ధ్రువీకరణ పత్రాల జారీలో కొన్ని చోట్ల అక్రమాలు అవుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. కొందరు కార్యదర్శులు సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్లు, మరికొన్ని చోట్ల తప్పుడు పత్రాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పత్రాలు డిజిటల్ కీ విధానంలో ఇవ్వడం ద్వారా అక్రమాలకు చెక్ పెట్టినట్లు అవుతుంది. మీ సేవ ద్వారా దరకాస్తు చేసుకున్న వారికి పత్రాలు సిద్ధం కాగానే వారి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఈ సేవలను రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పొందేందుకు వీలుండడంతో దరఖాస్తుదారుడికి వ్యయప్రయాసాలు తగ్గనున్నాయి.

ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలి



జననచ మరణాల ధ్రువీకరణ పత్రాల జారీ ఆన్‌లైన్‌లోనే ఇచ్చేలా కార్యదర్శులకు డిజిటల్ కీ అందించాం. తప్పనిసరి డిజిటల్ సంతకంతోనే ఆయా పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది.
– గంగమోహన్, ఎంపీడీఓ, తాడూరు

క్లుప్తంగా

ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయాలి



తెలకపల్లి: రజకుల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రజక వృత్తిదారులకు రూ. 10 లక్షల సబ్సిడీ రుణాలు, ఉచిత విద్యుత్, లబ్ధిదారులకు స్టీమ్ ఐరన్, టేబుల్ ఇవ్వాలని అన్నారు. రజకులపై దాడులు ఆపాలని, మహిళలపై అత్యాచారాలు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రంగాలలో ఉన్న ఏబీసీడీ వర్గీకరణ రాజకీయ రంగంలో కూడా అమలు చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బక్కయ్య, గౌరవ సలహాదారులుగా శ్రీనివాసులు, అధ్యక్షుడిగా రవి, ప్రధానకార్యదర్శిగా సుబ్బయ్య పలువురిని ఎంపిక చేశారు.

'అధికార పార్టీ ఆగడాలపై ఉద్యమిద్దాం'

బల్మూర్: అధికార పార్టీ ఆగడాలపై ఉద్యమించాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని జినుకుంట శివారులోని కనకాల మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భూ దందాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తాను ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం కాయమని కార్యకర్తలు పార్టీకి అండగా ఉండాలని కోరారు. జినుకుంట శివారులోని కొండమోని కృష్ణయ్యకు చెందిన భూమి కేసు కోర్టులో ఉందని, ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కోర్టు ఆదేశించినా అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితో రైతు బోరుమోటార్‌ను తీసివేయడం దుర్మార్గం అన్నారు. దీనిపై బాధిత రైతుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీపతిరావు, వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్, నర్సింగరావు, నిరంజన్‌గౌడ్, కృష్ణయ్య, ఖాజా, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల తహసీల్దార్ పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శంకరయ్య శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మల్లేష్, కర్ణాకర్, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో పాటు యంగంపల్లి, అల్లాపూర్‌లో శ్మశాన వాటికలను ఎంపీడీఓ గంగామోహన్ మంగళవారం పరిశీలించారు. శ్మశానవాటిక ఆవరణ అంతా పచ్చని మొక్కలు నాటాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. బీజేపీ అధిష్టానంపై స్థానిక నేతలు ఒత్తిడి తీసుకోవాలని ఆయన కోరారు. మంగళవారం కొల్లాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రావును వారు కలిశారు. వర్గీకరణ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. వర్గీకరణ ద్వారానే మాదిగలు, ఉపకులాల ప్రజలు అభివృద్ధి చెందుతారని వివరించారు. కార్యక్రమంలో శివ, శీలం అగ్రస్వామి, రాములు, కృష్ణయ్య, రామకృష్ణ, రమేష్, లక్ష్మణ్, స్వాములు, శివ, కురుమయ్య పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను విజయవంతం చేయాలి

తాడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రచ్చకట్ట వద్ద సర్పంచ్ యాదమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆపరేషన్లతో పాటు ఉచితంగా అద్దాలను అందజేస్తారన్నారు.

వంగూరు: కంటి వెలుగు పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ భీమమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో రెండు వైద్య బృందాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పవన్ కుమార్, ఎంపీఓ లక్ష్మణ్, మండల వైద్యాధికారి మానస పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటైన గిరిజనతండాలకు కొత్త పంచాయతీ భవనాలను నిర్మించడానికి నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైన గ్రామాలకు రూ.57కోట్లు మంజూరుకు ప్రతిపాదనాలను అందించామన్నారు. కొత్త పంచాయతీలకు రోడ్లు, మండలానికి 5 పల్లెదవాఖాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్ ఉన్నారు.

..అప్పుడే వేముల రోహిత్‌కు నివాళి


రోహిత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశంలో, రాష్ట్రంలో మతోన్మాద ఆగడాలను ఎప్పుడైతే ఎదురించగలమో అప్పుడే వేముల రోహిత్‌కు నిజమైన నివాళి అర్పించగలమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. మంగళవారం వేముల రోహిత్ 7వ వర్ధంతిని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ.. 2016లో అప్పటి సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల వేధింపుల వల్లే వేముల రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యారంగంలో మతభావాలు జొప్పిస్తూ దాడులు, హత్యలకు పాల్పడేలా ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ఆగడాలు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, బలహీన వర్గాలపై దాడులు విపరీతంగా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పర్వతాలు, రామయ్య, మోహన్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: నిజామబాద్ జిల్లా కోటగిరిలో దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై కులం పేరుతో దూషించి బలవంతంగా దేవుడి గుడికి తీసుకెళ్లి బొట్టుపెట్టి గ్రామ వీధులల్లో ఊరేగించడం అనాగరిక చర్య అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిని దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వెంటనే నిందితులను అరెస్టు చేయాలన్నారు. వీడీసీ పేరుతో గ్రామాలలో కుల బహిష్కరణలు అవుతున్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినాయకుడికి చందా ఇవ్వలేదని కక్షతో ఉపాధ్యాయుడిని ఇలా చేయడం దుర్మార్గం అన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో రామయ్య, ఉస్సేన్, ధర్మయ్య, మాసన్న, వెంకటేష్, భాలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
అచ్చంపేట రూరల్: నిజామాబాద్ జిల్లాకు చెందిన దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో హమాలీ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దుర్గయ్య, మంగ్యానాయక్, మల్లయ్య, లక్కీరాం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి
కొల్లాపూర్: దళిత ఉపాధ్యాయుడిని అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్డీఓ హనుమానాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఒక వర్గానికి చెందిన నాయకులు మల్లికార్జున్‌ను కులం పేరుతో దూషిస్తూ, బలవంతంగా గుడికి లాక్కెళ్లి బొట్టుపెట్టించిన ఘటన వ్యక్తి స్వేచ్ఛను హరించడమేనన్నారు. కార్యక్రమంలో దశరథం, వెంకటస్వామి, సత్యనారాయణ, సంగెం, కురుమయ్య తదితరులున్నారు.

చేపల కంపెనీని పరిశీలించిన కలెక్టర్

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి సమీపంలో ఉన్న చెంచుగూడెంలో ప్రభుత్వం నిర్మిస్తున్న చేపల కంపెనీ కలెక్టర్ ఉదయ్‌కుమార్ మంగళవారం రాత్రి పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి కాంట్రాక్టరుతో అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని గ్రంథాలయ భవనంలో కంటి వెలుగు పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బాధిత కుటుంబానికి చేయూత


సరుకులు, ఇతర వస్తువులను అందిస్తున్న దాతలు

లింగాల: మండలంలోని శ్రీరంగాపూర్ చెందిన అంకులయ్య పూరి గుడిసె ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శ్రీకాంత్‌భీమా, సింధూరరెడ్డి, వనవాసి కల్యాణ పరిషత్ విభాగ్ వారితో కలిసి మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఆస్పత్రి చికిత్స చేయిస్తామన్నారు. కొత్త గుడిసెను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబానికి నిత్యావసర సరకులతో పాటు దుస్తులు, దుప్పట్లు, వంట పాత్రలు అందజేశారు. కార్యక్రమంలో అశోక్, వెంకటయ్య, లింగన్న, శ్రీనునాయక్, సహదేవ్, రవితేజ, కిట్టు పాల్గొన్నారు.

పీఆర్‌సీని అమలు చేయాలి


డీఈ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే పీఆర్‌సీని అమలు చేయాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటి డీఈ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏప్రిల్ 2022 నుంచి రావాల్సిన పీఆర్‌సీ ఇంత వరకు రాలేదన్నారు. యాజమాన్యంతో ఎన్నిసార్లు చర్చలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో రామయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వెల్దండ: మండల కేంద్రంలో రిక్రియేషన్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మంగళవారం క్రీడలతో ముగియడంతో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరెడ్డి, సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాస్, క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

కొల్లాపూర్: యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రావు అన్నారు. సచిన్ లెవెన్ టీం ఆధ్వర్యంలో మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా పీసీ లెవెన్ జట్టు, రన్నరప్‌గా ఎస్‌డీ లెవెన్ జట్టు నిలిచాయి. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నరప్ జట్టుకు రూ.20 వేల నగదును జగదీశ్వర్‌రావు అందజేశారు.

లింగాల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వల్లభాపూర్‌లో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య నగదును, షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ ధర్మారెడ్డి, లింగస్వామి, నిరంజన్ మల్లేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కొల్లాపూర్: లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం తన నివాసం వద్ద సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. బిచ్చన్నకు రూ.24వేలు, మహేష్ రూ.48 వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి.

శ్మశానవాటిక స్థల సమస్య పరిష్కరించండి

అమ్రాబాద్: పదర మండలం వంకేశ్వరంలో దళితల శ్మశానవాటిక స్థల సమస్యను పరిష్కరించాలని మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సాయిలు మంగళవారం ప్రకటనలో అధికారులను కోరారు. గ్రామ సమీపంలో ఉన్న దళితుల శ్మశానవాటిక స్థలాన్ని సగం కొంత మంది ఆక్రమించుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామంలో ఈదమ్మ మాంధాత ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


షీల్డ్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు

బల్మూర్: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అందిపుచ్చుకుంటారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని కొండనాగులలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. విరాట్ జట్టు ప్రథమ స్థానంలో విజేతగా నిలువగా రన్నర్‌గా శ్రీనివాస రాయల్ టీం నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.50వేల నగదు, రన్నర్‌కు రూ.30వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. కొండనాగులలో క్రికెట్ మైదానం కోసం ప్రస్తుతం ఉన్న స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై కూడా తమ ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్యయాదవ్, సర్పంచ్ రేవతి, ఉప సర్పంచ్ యూనూస్, ఆవుల తిరుపతయ్య పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీపీ ఉమామహేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సాయిరాం మాట్లాడుతూ. ప్రస్తుతం మంచాలకట్ట రూ.5లక్షలు, జటప్రోలు రూ.15లక్షలు, మల్లేశ్వరం రూ.5లక్షలు, పెంట్లవెల్లికి రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద గతేడాది హరితహారంలో భాగంగా లక్ష మొక్కల వరకు పెంచామని, ఈ సంవత్సరం 1.5 లక్షల మొక్కలు పెంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని అసిస్టెంట్ ఏపీఓ మోహన్ కృష్ణ తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా నీరు, కాలుష్యం, కరెంటు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామానికి అందేలా చూడాలన్నారు. పెంట్లవెల్లి, మాధవస్వామినగర్ సర్పంచ్‌లు మినహా మిగతా గ్రామాల సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకాకపోవడంపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో కోఆప్షన్ మెంబర్ మతిన్, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, ఎంపీడీఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వరినారులో అగ్గితెగులును అరికట్టాలి


వరిలో అగ్గి తెగులును పరిశీలిస్తున్న అధికారులు

బిజినేపల్లి: వరినారు మడులలో అగ్గి తెగులు ఎక్కువగా ఆశిస్తుందని, దీనిని నివారించడానికి రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ సాయిరాం సూచించారు. మంగళవారం తిమ్మాజీపేట మండలంలోని బుద్ధసముద్రంలో వరి నారు మడులలో ఆశించిన అగ్గితెగులు పంటను రైతులతో కలిసి పరిశీలించారు. చలితో కూడిన వాతావరుణం ఉన్నందున ఈ తెగులు ఉధృతి పెరిగిందని, దీనికి ఎప్పటికప్పుడు నీరు పెట్టి తీస్తుండాలని సూచించారు. నాటినో అనే శిలింద్ర నాశిని వారంలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ బాలయ్య, రైతులు బాలరాజు, విజయ్, మల్లేష్ ఉన్నారు.

ఆస్పత్రిలో మెరుగైన సేవలు


సిబ్బందికి సూచనలు చేస్తున్న శివరాం, సంతోష్

కల్వకుర్తి టౌన్: ఆస్పత్రిలో మెరుగైన సేవలకు అందించే లక్ష్యా అసెస్మెంట్ విభాగానికి ప్రతి ఒక్క సిబ్బంది సహకారంతో విజయవంతం చేయాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం అన్నారు. మంగళవారం నెలవారి సమీక్షలో భాగంగా సిబ్బందికి సూచనలు చేశారు. రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారన్న వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ రోగులకు అందించే సేవలలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పరికరాన్ని పూర్తిగా స్టెరిలైజేషన్ చేయాలని, వాటిని సరైన పద్ధతిలో వాడాలని సూచించారు. లక్ష్యా అసెస్మెంట్‌ను సాధించేందుకు అన్ని విభాగాలను సరిగ్గా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యులు స్వర్ణలత, సందీప్, పాండురంగ, విజయ్ కుమార్, సింధు, స్వప్న, క్వాలిటీ మేనేజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

కొల్లాపూర్: పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వక్తలు అన్నారు. మంగళవారం పట్టణంలో ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రూప్–4 స్టడీ మెటీరియల్‌ను నిరుద్యోగులకు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నక్క వేణుగోపాల్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, అజయ్‌కుమార్‌యాదవ్, సుధారాణి, స్వామి యాదవ్, రాజయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వెల్దండ: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2000–01 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ గురువులకు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ప్రస్తుతం ఉద్యోగాలు, వ్యాపారం చేస్తున్న తీరును తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నయ్య, సుధాకర్, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కోడేరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాయిపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్, ఎద్దుల బండ్ల ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య హాజరై మాట్లాడారు. నర్సాయిపల్లి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఇప్పటికే రోడ్ల విస్తీర్ణ సగంలో ఆగాయని, పనుల పూర్తికి ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో 70 ఎకరాలు ప్రభుత్వ భూమి చూపితే బీసీ డిగ్రీ కళాశాల మంజూరు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సత్యానారాయణయాదవ్, జగన్‌మోహన్ రెడ్డి, నరహరిగౌడ్, అర్జునయ్యగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.